త్వరలో ఆదిత్యానగర్ రోడ్డు పనులు ప్రారంభిస్తాం

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి వెల్లడి
- అధికారులతో కలిసి కాలనీలో పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సరూర్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గుర్రంగూడ 7వ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్‌కాలనీ రోడ్డు పనులను నాలుగైదు రోజుల్లో ప్రారంభింపజేస్తామని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి వెల్లడించారు. గతంలో కంకర పరిచి వదిలేసిన రోడ్డు మొత్తాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఆదిత్యానగర్ రోడ్డు పనులను గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా మొదలుపెట్టి, ఆ తర్వాత అర్థాంతరంగా ఆపేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై 'కంకరపరిచి ఆరు నెలలు.. నేటికీ పూర్తి కాని రోడ్డు నిర్మాణం పనులు' అనే శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం ప్రచురితమైన సంగతి విదితమే. అనంతరం ఆ కథనం క్లిప్పింగ్‌ను జతచేసి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్టగల్ల రవీందర్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులపై ముందడుగు వేశారు. ఇందులో భాగంగా శనివారం మునిసిపల్ కమిషనర్ జి.రఘు, గుర్రంగూడ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్‌తో కలిసి మేయర్ పారిజాతారెడ్డి ఆదిత్యానగర్‌లో పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును, రోడ్డుపై ధ్వంసమైన మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. స్థానికులు తమ ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఈ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభింపజేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రోడ్డు పనులను పక్కాగా చేపట్టాలని ఆమె అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఎక్కోనికుంట చెరువు మరమ్మతులు చేపడతాం

గుర్రంగూడలోని ఎక్కోనికుంట చెరువు మరమ్మతు పనులను సైతం త్వరలోనే ప్రారంభింపజేస్తామని మేయర్ పారిజాతారెడ్డి తెలిపారు. శనివారం ఆమె చెరువును సందర్శించి సుందరీకరణలో భాగంగా చేపట్టనున్న చెరువు కట్ట మరమ్మతు పనులు తొందరగా మొదలుపెట్టించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ డీఈఈ యాదయ్య, ఏఈ వినీల్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, ఆదిత్యానగర్‌కాలనీ అధ్యక్షుడు పీ.రవి, స్థానిక నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐలమ్మ, గడ్డం లింగారెడ్డి, పందుల వెంకటేశ్‌గౌడ్, విఘ్నేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆదిత్యానగర్ రోడ్డులో ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

ఘనంగా వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

- ప్రత్యేక పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్

కొత్తపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్నేహపురిలోని గోదాసమేత పద్మావతీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేదమంత్రాల మధ్య సంప్రదాయబద్ధంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి కల్యాణమహోత్సవంలో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక అర్చన చేయించారు. ఆలయ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ పూర్వ చైర్మన్ అనంతుల యాదగిరిరెడ్డి ఎంపీ ఈటల రాజేందర్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అర్చన చేయిస్తున్న ఎంపీ ఈటల, కార్పొరేటర్ పవన్‌కుమార్

ప్రజాపాలనలో అర్హులందరికీ న్యాయం చేస్తాం

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాపాలనలో సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 113 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖ, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి, వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ నిజాముద్దీన్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన సీపీఐ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని క్యాంపు కార్యాలయంలో శనివారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ కలిశారు. ఈ సందర్భంగా కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో వెలసిన గుడిసెలను తొలగించాలని రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లుగా వందలాది మంది ఇళ్లు లేని పేదలు అక్కడ నివాసం ఉంటున్నారని చెప్పారు. ఈ విషయంలో అధికారుల బెదిరింపుల నుంచి ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నేతల విజ్ఞప్తికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సైదులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టికి నేతల శుభాకాంక్షలు

సరూర్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శనివారం పలువురు కాంగ్రెస్ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి భట్టిని ఆయన నివాసంలో కలిసి కేక్ కట్ చేయించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. మీర్‌పేట్ కార్పొరేటర్లు చల్లా కవితాబాల్‌రెడ్డి, సిద్దాల మౌనికాశ్రీశైలం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సిద్దాల దశరథ, నాయకులు వెంకటేశ్‌గౌడ్, యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న చల్లా

నాలా నిర్మాణ పనులను పూర్తిచేయాలి

చంపాపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని సూర్యానగర్ కాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీలో ఎస్ఎన్‌డీపీ కింద కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. వంగా శంకరమ్మ గార్డెన్ నుంచి వెంకటేశ్వర ఆస్పిటల్, సింగిరెడ్డి శివారెడ్డి గార్డెన్ నుంచి ఎంఆర్ఆర్‌కాలనీ వరకు చేపట్టిన నాలా నిర్మాణ పనులను త్వరితగతిన నాణ్యతగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఈఈ కృష్ణయ్య, డీఈ వెంకటకిరణ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, ఆయా కాలనీల అధ్యక్షులు జయవర్ధన్‌రెడ్డి, ప్రతినిధులు విశ్వం, బుచ్చిరెడ్డి, అమర్, నర్సింహ, భూపతిరెడ్డి, రాఘవేందర్‌రావు, నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి: కార్పొరేటర్

చంపాపేట: హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీ ఫేజ్-2లో శనివారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించారు. కాలనీలో కొనసాగుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ హేమునాయక్, వర్క్ఇన్‌స్పెక్టర్ బిక్కునాయక్, కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమతమల్లేష్‌గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: శ్వేత

సైదాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. డివిజన్‌లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. తొలుత రోడ్లు, తాగునీరు, మురుగునీరు సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, రేణుకా ముదిరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు శిక్షణ తరగతులు ప్రారంభం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ సహకారంతో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతుల్లో న్యాయవాదుల హక్కులు, బాధ్యతలతో పాటు కోర్టుల్లో ఎలా వ్యవహరించాలో వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. రంగారెడ్డి కోర్టుల బార్‌అసోసియేషన్ హాల్‌లో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు అన్నిజిల్లాల న్యాయవాదులు, వివిధ కోర్టుల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జువెనైల్ హోంలలో ఆకస్మిక తనిఖీలు

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రత్యేక బాలుర గృహం(జువెనైల్ హోంలు)లను శనివారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి, జిల్లా జడ్జి సీహెచ్. పంచాక్షరీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక గృహంలో వివిధ కేసుల విచారణలో ఉన్న బాలలు, బాలుర గృహంలో ఉన్న వీధి బాలలు, బాలకార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను పరిశీలించారు. హోంలో విలువిద్యలో శిక్షణ పొందుతున్న చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ పరిపాలనాధికారి కళార్చన, జువెనైల్ శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బేగ్, హోమ్ సూపరింటెండెంట్లు నాగేశ్వర్‌రావు, నవీన్‌కుమార్, అఫ్జల్, ఏసీపీఎస్ చారువాక్, గోపికుమార్ పాల్గొన్నారు.



శిక్షణ వివరాలు తెలుసుకుంటున్న జడ్జి పంచాక్షరీ

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెల్లి ప్రభుత్వ పాఠశాలలో స్థానిక ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన నోట్‌బుక్‌లను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు దోటీ వెంకటేష్‌యాదవ్, వేముల చంద్రశేఖర్, హెచ్ఎం రాజమణి, నాయకులు అచ్చయ్య, భాస్కర్, పాండు, మహేష్ పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే

ఎల్బీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయి డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్‌తో ఆయన సమావేశమై పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ పనులు ఎన్నో సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. బాక్స్ డ్రైన్లు, ట్రంక్‌లైన్ల నిర్మాణం వల్ల చాలా వరకు ముంపు సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా కొన్ని డివిజన్లలో పూర్తిస్థాయిలో డ్రైన్ల నిర్మాణం చేపడితే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈలు కృష్ణయ్య, శ్రీనివాస్, కార్తీక్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సత్యంచారి, శ్రీనివాస్‌నాయక్, రవి ముదిరాజ్, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ సీఈ జియావుద్దీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎల్ఓసీని అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

సీఎం ఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

వనస్థలిపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేదలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీకృష్ణనగర్‌కాలనీకి చెందిన అయితగోని మంగమ్మ కొంతకాలంగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతుంది. ఆమె చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కట్ల నర్సింహయాదవ్‌తో కలిసి మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.2.5లక్షల ఎల్ఓసీ చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు శనివారం మధుయాష్కీగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, బుడ్డ సత్యనారాయణ, లింగాల కిషోర్ గౌడ్, బద్దుల వేణుగోపాల్‌యాదవ్, చెనగోని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు.. సైబర్ సేఫ్టీ పాఠాలు

- రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్‌కేఎస్‌సీ), రాచకొండ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వయో వృద్ధులకు సైబర్ నేరాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైనిక్‌పురిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిజిటల్ సేఫ్టీ నిపుణులతో పాటు సైబర్ క్రైం ఏసీపీ కరుణాకర్‌లు సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి బారిన పడకుండా తప్పించుకోవడం, అవగాహన, సైబర్ సురక్ష, పాస్‌వర్డ్ ప్రొటెక్షన్, ఫిషింగ్ తదితర అంశాలపై వయోవృద్ధులకు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల సీపీ తరుణ్ జోషి ఆర్‌కేఎస్‌సీ సభ్యులను అభినందించారు. విద్యార్థులు, యువత కోసం ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ రఘువీర్, కోఆర్డినేటర్ సావిత్రితో పాటు పోలీసు అధికారులు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.



సైబర్ సేఫ్టీ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్‌లు

దేశవ్యాప్తంగా రూ.1,750 కోట్లు కొల్లగొట్టారు

- సైబర్ నిపుణులు షంషేర్ ఖాన్

సైబర్ నేరగాళ్లు ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా రూ.1,750 కోట్లు కొల్లగొట్టారని, ఎఫ్ఎస్ సైబర్ సంస్థ ఫౌండర్ షంషేర్‌ఖాన్ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్వెస్ట్‌మెంట్ నేరాలు, గేమింగ్ యాప్‌లు, లోన్‌యాప్స్, ఫిషింగ్, ఓటీపీ, లైంగిక వేధింపులు, కాల్ స్పూఫింగ్, బ్యాంకింగ్ నేరాలు, సోషల్ మీడియాలో వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాంసంవేర్ బారినపడితే సైబర్ నేరగాళ్లు అడిగినంత చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ఆస్పత్రులు, ఐటీ సంస్థలు, స్టార్టప్‌లు, ఇతర వాణిజ్య సంస్థలకు తక్కువ ఖర్చులోనే సైబర్ సెక్యూరిటీని అందిస్తున్నామని తెలిపారు.

జీహెచ్ఎంసీకి చెందిన భూమి కబ్జాకు యత్నం

ఫెన్సింగ్ తొలగించిన దుండగులు

- సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ అన్మగల్ హయత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీకి చెందిన ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 191లోని 1ఎకరాల 9గుంటల భూమికి ఉన్న ఫెన్సింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తొలగించారు. ఫెన్సింగ్ తొలగించారని సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావణి, సెక్షన్ ఆఫీసర్ మన్సూర్‌అలీ, చైన్‌మెన్ సతీష్, సాయికుమార్‌లు శనివారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. దాదాపు వంద మీటర్ల వరకు ఫెన్సింగ్ తొలగించినట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు సదరు విలువైన భూమిని ఆక్రమించుకోవడానికే జీహెచ్ఎంసీ వేసిన ఫెన్సింగ్‌ను అక్రమంగా తొలగించారని అధికారులు తెలిపారు. వెంటనే జేసీబీని తీసుకువచ్చి ఈ భూమి జీహెచ్ఎంసీకి చెందినదని పేర్కొంటు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ తొలగించిన వారిని గుర్తించి వారిపైన పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉన్న ఈభూమి చుట్టు ప్రహరీ నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లపైన జరుగుతున్న దాడులను ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేస్తూ భారత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆరు నెలలుగా ప్రభుత్వానికి కూడా సమాచారం ఇవ్వకుండా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్లినిక్‌లపైన దాడులు చేస్తూ వైద్యులను వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని గ్రామీణ వైద్యులంతా కలిసి గురువారం సీఎంని కలిసి తమపై జరుగుతున్న దాడులను వివరించడం జరిగిందన్నారు. అందుకు స్పందించిన సీఎం వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి సంగీతకు ఫోన్ చేసి క్లినిక్‌లపై దాడులు ఆపాలని చెప్పారని తెలిపారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్న తమపై దాడులు చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వ గ్రామీణ వైద్యులను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉపేందర్, డాక్టర్లు రమేష్, జయప్రకాష్, శంకర్, జితేందర్, వెంకటేశ్వర్‌రావు, ప్రవీణ్‌సింగ్, నరేష్, చంద్రశేఖర్, లక్ష్మణ్, లింగయ్య బాబు, ముఖరంజీ, వెంకటేశ్వర్లు, నర్సింహ, రాజు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మలక్‌పేట ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సైదాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే బలాల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సమస్యలను వైద్యుల కమిటీ ముందు ఉంచారు. ప్రధాన సమస్యలుగా బాత్‌రూముల లీకేజీ సమస్యలు, ఫిజియోథెరపీ, సీఏఆర్ఎం యంత్రాల కొనుగోలు చేయాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం, ఆర్ఎంఓ కర్ణాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల పొడిగింపులు

అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న వ్యాపార సంస్థల నిర్వహణను పొడిగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పబ్లిక్ టెండర్లు పిలిచి కేటాయింపులు జరగాల్సి ఉండగా గుట్టుచప్పుడు కాకుండా పొడిగించడంపై పలు విమర్శలకు తావిస్తోంది. టెండర్లు పిలిస్తే ఆస్పత్రికి మరింతగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఫర్నీచర్ షాపుతో పాటు ఇతర దుకాణాల టెండర్ల గడువు రెండు నెలల కిందే ముగిసినప్పటికీ తాజాగా శనివారం కమిటీ రెన్యూవల్ చేయడం వివాదంగా మారింది. టెండర్ల కేటాయింపులపై విచారణ జరపాలని బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణ్‌సింగ్ డిమాండ్ చేశారు.



సమావేశంలో ఎమ్మెల్యే బలాల, సూపరింటెండెంట్ త్రిలోక్ శ్యాం

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

హయత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హయత్‌నగర్‌లోని శుభోదయకాలనీలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా పెన్‌పహాడ్‌తండాకు చెందిన రూపావత్ పున్న, స్వప్న(20) దంపతులు శుభోదయకాలనీలో కొంతకాలంగా నివాసముంటున్నారు. పున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో పనిచేస్తుండగా.. స్వప్న గృహిణిగా ఉంది. అయితే కొన్ని రోజులుగా భార్యభర్తల నడుమ మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన స్వప్న శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్లపై గుంతలను పూడ్చండి

- బడంగ్‌పేట్ కమిషనర్‌కు స్థానికుల వినతి


సరూర్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌కు చెందిన రోడ్లపై ఏర్పడిన గుంతల్లో కనీసం మట్టి పోసి మరమ్మతులు చేయాలని కోరుతూ డివిజన్ పరిధిలోని శ్రీమారుతీనగర్, సప్తగిరికాలనీ, నైన్‌హిల్స్ కాలనీ, వసంత్‌విహార్, చంద్రవిహార్ తదితర కాలనీలకు చెందిన ప్రతినిధులు శనివారం కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్‌తో కలిసి మునిసిపల్ కమిషనర్ రఘుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బురదమయంగా మారిన రోడ్లపై పాదచారులు నడవలేక పోతున్నారని, ద్విచక్ర వాహనాలు జారి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి మడుగులుగా మారాయని, ఈ దృష్ట్యా సదరు గుంతలను మట్టితో పూడ్చాలని వారు విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో శ్రీమారుతీనగర్ కాలనీ అధ్యక్షుడు కర్ణకోట నరేశ్, వసంత్‌విహార్ ఫేజ్-1 అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



కమిషనర్ రఘుకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అర్జున్, నరేశ్ తదితరులు

గోవులను తరలిస్తున్న లారీని అడ్డుకున్న మహిళలు

చాదర్‌ఘాట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గోవులను తరలిస్తున్న లారీని ఇద్దరు మహిళలు ఓల్డ్‌మలక్‌పేటలోని అగ్రికల్చర్ కార్యాలయం ఎదుట శనివారం అడ్డుకున్నారు. మహబూబ్‌నగర్‌లోని పెబ్బేర్ నుంచి తీసుకువచ్చిన గోవుల లారీని గుర్తించిన మహిళలు అడ్డుకోవడంతో ఓ వర్గం ప్రతిఘటించినా వారి బెదిరింపులను ఖాతరు చేయకుండా ఎదురొడ్డి నిలిచారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఓల్డ్‌మలక్‌పేటలో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు రంగంలోకి దిగారు. లారీని అడ్డుకున్న ఇద్దరు మహిళలను కూడా పోలీసులు అక్కడి నుంచి తరలించారు. లారీని స్వాధీనం చేసుకున్నారు.



లారీని అడ్డుకుంటున్న మహిళ

వీసీ నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

సైదాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో బీసీలను 50శాతం నియమించి న్యాయం చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఏ. రాజేశ్వర్‌యాదవ్ శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందజేశారు. అలాగే బోర్డు ఆఫ్ డైరక్టర్ల ఎంపికలో కూడా బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, గోదా కన్నాయాదవ్, జగదీష్‌గౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాచారం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఎస్ఐ జంగయ్య కుటుంబ సభ్యులకు సీపీ చెక్కును అందించారు. నేరేడ్‌మెట్ కమిషనర్ కార్యాలయంలో శనివారం జంగయ్య కుమారులు ప్రవీణ్‌కుమార్, సందీప్‌కుమార్‌లకు కమిషనర్ తరుణ్‌జోషి రూ.7,93,858 భద్రత చెక్కును అందజేశారు. అంతేకాకుండా జంగయ్య కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఎస్ఐ జంగయ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న సీపీ తరుణ్ జోషి

ఇకపై అన్ని రోడ్లలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

- వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి

సరూర్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అన్ని రోడ్లలో ఇకపై రెగ్యులర్‌గా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్‌పేట్ చౌరస్తాలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయేదాకా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏసీపీ పర్యవేక్షించారు. ఈ పరీక్షల్లో మద్యం అధిక మోతాదులో తీసుకున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఫలానా రోడ్డు, ఫలానా చౌరస్తా అని కాకుండా ఇకపై ప్రతి రోడ్డులోనూ సడన్ డ్రైవ్‌లు చేపడతామని, డ్రంకెన్ డ్రైవ్‌ను పూర్తిగా అదుపు చేయడమే తమ లక్ష్యమని అన్నారు.



మీర్‌పేట్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు


ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో..

కొత్తపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని ఎల్బీనగర్ రింగ్ రోడ్డు, కామినేని చౌరస్తాల్లో శుక్రవారం రాత్రి 10గంటల నుండి అర్ధరాత్రి వరకు ఎస్‌హెచ్ఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎస్ఐ మధు, పదిమంది కానిస్టేబుళ్లు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలు నడుపుతున్న వారికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఏడుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నారు.



వాహనాల తనిఖీలో ఎస్‌హెచ్ఓ రామాంజనేయులు, పోలీసులు

వ్యక్తి అదృశ్యం



అబ్దుల్లాపూర్‌మెట్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ తొర్రూర్‌కు చెందిన లోగిశ సుధీర్(30) ఏడాది నుంచి కొత్తగూడెంలోని హెచ్ఎండీఏ వీడీలైట్ గోదాంలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 11న ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఆయన తిరిగి ఇంటికి రాలేదని అతడి కుటుంబ సభ్యులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూసలబస్తీలో వృద్ధుడు..



సైదాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులను ఆశ్రయించారు. పూసలబస్తీలో నివాసముండే ఉయ్యాల లింగయ్య(75) కల్లు కంపౌండ్‌లో పనిచేస్తాడు. ఈ నెల 4న ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా కల్లు కంపౌండ్ మూసివేశారు. దీంతో ఆ రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన లింగయ్య తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.